తెల్లమార్కెట్టు

"ఏమండీ, ఒక రూపాయి కావాలి, ఇవ్వండి"

"ఎందుకూ?"

"పక్క ఇంటావిడ బియ్యం ఇస్తానన్నది"

"ఇప్పుడు బియ్యం దేనికీ?"

"రేపను ఇవాళ్తో చెల్లూ, రేపూ, ఎల్లుండీ, తినొద్దూ?"

"ఏం? ఇంతలో ఎందుకయ పోయాయీ?"

"ఏవారం సరిపొయ్యేయేమిటి? రెండు వారాలకూ, మూడువారాలకూ ఒకపడి కొంటూనే ఉన్నా."

"రేషన్ ధరకేనా?"

"రేషన్ ధర కెవరన్నా ఇస్తారా ఏం? పడి రూపాయి అణా!"

"రూపాయి అణాయే! గది అవతలే పెట్టావూ బ్లాక్ మార్కెట్టూ? కొంప గుల్లే!"

"అణా నా దగ్గిరుంది రూపాయి ఇస్తరూ"

"నాబొందిలో ప్రాణం ఉండగా ఇవ్వను"

"రేపూ, ఎల్లుండీ ఏం తిందాం?"

"రెండురోజుల బియ్యం ఎట్లా తక్కువయాయి అని!"

"మీరు నిన్న ముగ్గుర్ని భోజనానికి తెచ్చారు జ్ఞాపకం ఉందా? అంతకు మునుపు వరసగా మూడురోజులు ఇడ్లీను చేసుకు తిన్నాం జ్ఞాపకం ఉందా?"

"అదంతా నాకు తెలీదు నేను బ్లాకు మార్కెట్టులో ఇంతమట్టికూడా కొనను. నీవంటివాళ్లే కాంగ్రెసుప్రతిష్ట గంగపాలు చేస్తున్నది. మొన్న సర్దారుపటేలు లేమన్నాడో విన్నావా?"

"పోనీ సర్దారుపటేల్ నడిగి పడిబియ్యం పట్టుకురండి"

"నీకంతా వేళాకోళంగా ఉంది"

"ఏ ఆవిడ్ బియ్యం ఊరికే ఇస్తుందేమో అడగనా?"

"అంత కంటెనా?"

"అదీ రహస్యం! డబ్బు ఖర్చుకాదు."

"ఎంతసేపటికీ డబ్బుసంగతే ఆలోచిస్తావు గాని, నీతిసంగతి ఆలోచించవే"

"ఇంటో బియ్యం నిండుకుంటే దొరికిన కాడికి కొనటంలో అవినీతి ఏమిటో నాకు బోధపడలేదు"

"నీకు బోధపడేట్టు చేస్తా నుండు ఆవిడ పేరేమిటో చెప్పు ఇప్పుడే వెళ్లి పోలీసులకు రిపోర్టిస్తా!"

"చాలెండి! పుణ్యం ఉంటుంది?"

శ్రీ కొడవటిగంటి
కుటుంబరావు

"పుణ్యమేమిటి, పురుషార్థం? ఈ అవినీతి ఎట్లా అంతమయేట్టు?"

"సరే పస్తులుందాం లెండి"

* * *

"ఇదేమిటే? తొమ్మిదైనా పొయి రాజెయ్యలేదూ? నే నాఫీసుకు పోవద్దు?"

"తేలిగ్గా వెళ్లండి ఇవాళ అన్నం లేదు"

"ఏం?"

"నిన్న నే చెబితినిగా? బియ్యం లేవు."

"ఆవిడదగ్గిర తీసుకుంటా నన్నావుగా?"

"అవినీతి అంటిరిగా? అదీ కాక మీరు నాకు డబ్బెక్కడ ఇచ్చారూ?"

"నిజంగానే బియ్యం లేవా?"

"మీ మీద ఒట్టండీ! పరాచకమా?"

"చంపేశావు! మళ్లీ రేపు నెప్పుడూ?"

"ఎల్లుండి"

"ఇవాళా, రేపూ పస్తే?"

"ఆహా"

"పోనీ, తగలెయ్యి! ఈసారికి తీసుకో, ఇంకోసారి ఇట్లా జరగకుండా"

"ఆవిడ నిన్నసాయంకాలమే ఇంకోరికి బియ్యం అమ్మేసింది"

"అవీ లేవూ?"

"లేవు"

"చంపావు!...ఉండకెం జేస్తాయి? అడిగి చూడు"

"లేవు పొద్దున అడిగాను—వచ్చి నప్పుడుడబ్బిద్దాంగదా అని. మీరు కబుర్లు చెబుతారుగాని మిమ్మల్ని తిండిలేకుండా పంపటం నాకిష్టమా?"

"లేవన్నదా?"

"ఆ"

"ఇంకోపావలా ఇస్తే ఉంటయ్యేమో?"

"నే నటువంటి బేరాలు చెయ్యలేనండీ"

"ఇంకెవరింటికో గన్నా—"

"నే నెవరింటికీ పోను ఏం మునిగింది? మీరు వెళ్లి హోటల్లో తినండి, నేను ఎల్లుండి ఎంగిలిపడతాను"

బాగుంది నువు చేప్పేది పద హోటల్లో తినివద్దాం ఏదీ, చూడనా? ఎంతవుతుందీ? పదణాలు, పదణాలూ రూపాయిపావలా రెండు రూపాయి పావలాలు, రెండున్నరా రెండు రెండున్నరలు అయిదు రూపాయలు! పోతే పోయింది! పోయిగా ఇవాళా రేపూ హోటల్లో భోంచేద్దాం! ఈ అవినీతిని మాత్రం సహించరాదు లే. లే!"